www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 27 నవంబర్ 2023

నేడు యథావిధిగా 'జగనన్నకు చెబుదాం'

రాయచోటి : ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10.00 గంటల నుంచి 'జగనన్నకు చెబుదాం - స్పందన' అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ గిరీష పిఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. ముఖ్యంగా మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో నిర్వహించే స్పందనకు రాగలరని తెలిపారు. స్పందన కార్యక్రమం ప్రారంభానికి ముందు సోమవారం ఉదయం 9.45 గంటలకు అధికారులతో స్పందన పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. స్పందనకు సంబంధించి ఎస్-ఎల్ఏ పరిధి దాటిన దరఖాస్తులు అన్నింటిని వెంటనే పరిష్కరించి పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై కూడా సమీక్షిస్తామన్నారు. అధికారులతో సహా స్పందనలో పాల్గొనే ప్రతి ఒక్కరూ కొవిడ్ ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ మనందరి బాధ్యత : జెసి

ప్రతిజ్ఞ చేస్తున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, అధికారులు

ప్రజాశక్తి - రాయచోటి

భారత రాజ్యాంగ పరిరక్షణ మన అందరి బాధ్యత అని, అందుకు ప్రతి భారతీయుడు తన వంతు కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ పేర్కొన్నారు. ఆదివారం 74వ భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణకు భారతీయ పౌరుడిగా కృషి చేయడం మన బాధ్యత అన్నారు. అన్నివర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి, అభ్యున్నతిని కాంక్షించి రచించిన రాజ్యాంగ గ్రంథాన్ని 26 నవంబర్ 1949న జాతికి అంకితం చేసి రాజ్యాంగ నిర్మాతగా ప్రపంచ చరిత్రలో చిరస్థాయిగా నిలిచారన్న విషయాన్ని మనం స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇదే రోజున జాతీయ న్యాయ దినోత్సవం, వరకట్న వ్యతిరేక దినోత్సవాలను కూడా నిర్వహించుకుంటున్నామన్నారు. త్యాగానికి, కృషి, సడలని పట్టుదల, నిజాయితీ, నిబద్ధత, చిత్తశుద్ధి, క్రమశిక్షణ, అకుంఠిత దీక్షాదక్షతలకు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ .బి.ఆర్. అంబెడ్కర్ నిలువెత్తు నిదర్శనం అన్నారు. ఆయన మేథా నిరతికి.. రెండు చేతులు జోడించి హృదయ పూర్వక అభినందనలు, కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామన్నారు.అనంతరం డిఆర్ఒ సత్యనారాయణ భారత రాజ్యాంగ గ్రంథంలోని పీఠికను చదివి వినిపించారు. అనంతరం భారత రాజ్యాంగం భారతీయ జీవన గమనాన్ని ప్రతిబింబించే విలువైన సాధనం అని, న్యాయ చట్టాల పరిరక్షణకు తమ వంతు కృషి చేస్తామని అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏవో బాలకృష్ణ, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

- ఐదవ అదనపు జిల్లా జడ్జి కృష్ణన్ కుట్టి

భారతదేశంలోని సర్వజనుల హక్కులను కాపాడే విధంగా ఉన్న భారత రాజ్యాంగాన్ని గౌరవించి కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని రాయచోటి ఐదవ అదనపు జిల్లా జడ్జి కృష్ణన్ కుట్టి అన్నారు. ఆదివారం భారత రాజ్యాంగ ముసాయిదాను ఆమోదించిన రోజును పురస్కరించుకుని రాయచోటి మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో మున్సిపల్ కార్మికులతో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో భాగంగా ఆదివారం ఉదయం 11 గంటలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1949 జనవరి 26వ తేదీన తొలి ముసాయిదా ప్రతులపై సంతకాలు చేశారని అందుకే ప్రతి సంవత్సరం నవంబర్ 26 ను రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని జరుపు కుంటున్నామని, 1950 జనవరి 26వ తేదీ నుంచి రాజ్యాంగం అమలులోకి వచ్చిందని ఆయన అన్నారు. కార్యక్రమంలో రాయచోటి మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ తాహిర్‌బాష,న్యాయవాది ఉదయగిరి రామాంజనేయులు, మున్సిపాలిటీ అసిస్టెంట్ ఇంజినీర్ వెంకట కృష్ణారెడ్డి, మున్సిపాలిటీ కూలీల యజమానులు సురేంద్రబాబు, శ్రీరాములు, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంపద పెంపునకు కృషి

జిల్లా మత్స్యశాఖ అధికారి ఎస్.సుస్మిత

ముఖా ముఖి..

ప్రజాశక్తి- రాయచోటి

జిల్లాలో మత్స్య కారులందరికీ అందుబాటులో ఉంటూ వారి సంపద పెంపునకు కృషి చేస్తానని జిల్లా మత్స్యశాఖ అధికారి ఎస్. సుస్మిత పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో మత్స్యశాఖ కారులకు, కార్మికులకు, కుటుంబాలు ప్రభుత్వం నుంచి అందే సబ్సీడీలను ఎలా పొందాలి, జీవనాధారం ఏవిధంగా చేయాలో ఆమె ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖిలో వివరించారు.

అన్నమయ్య జిల్లాలో మత్స్యశాఖ కార్యాలయాల వివరాలు తెలపండి?

అన్నమయ్య జిల్లాలో మత్స్య కార్యాలయాలు బహుదా, పీలేరులలో, సహాయ మత్యశాఖ కార్యాలయం రాజంపేట, మత్స్యశాఖ అభివృద్ధి కార్యాలయంలో మదనపల్లిలో ఉన్నాయి. గాలివీడు, గుర్రంకొండ, నిమ్మనపల్లె, పెద్దమండెం, వాల్మీకిపురం, చిన్నమండెం, బి. కొత్తకోట, కురబలకోట, మదనపల్లె, ములక చెరువు, పెద్ద తిప్పి సముద్రం, రామసముద్రం,, తంబళ్లపల్లె, లక్కిరెడ్డిపల్లె, రామాపురం, కలకడ, కంభంవారిపల్లె, పీలేరు, ముండుపల్లె, సంబేపల్లి, చిట్వేలు, నందలూరు, ఓబులవారిపల్లె పుల్లంపేట, పెనగలూరు, రైల్వే కోడూరు, రాజంపేట, వీరబల్లిలో సబ్ డివిజన్ కార్యాలయాలున్నాయి.

మత్స్యశాఖ అధికారుల పని వివరాలు తెలపండి?

మత్స్య శాఖలో చేప పిల్లలు పెంచడం, చెరువులు లీజుకు ఇవ్వడం, లైసెన్స్ రిజర్వాయర్లలో మత్స్య కారులకు లైసెన్సుల మంజూరు చేయడం, ప్రభుత్వ పథకాలాన్నిటిని మత్స్య కారులకు అందజేయడం అధికారుల ముఖ్య విధి.

జిల్లాలో చెరువులు, లైసెన్స్ రిజర్వాయర్లు ఎన్ని ఉన్నాయి?

జిల్లా వ్యాప్తంగా 149 చెరువులు, 2 లైసెన్స్ రిజర్వాయర్లున్నాయి. చేపల చెరువులకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి.

సిఎం, పిఎం మత్స్యశాఖలో పథకాలు ఏమైనా ఉన్నాయా?

ప్రధానమంత్రి మత్యశాఖకు సంబంధించి యువజన పథకం కింద ద్విచక్ర వాహనాలు, మూడు చక్రాల వాహనాలు, నాలుగు చక్రాల వాహనాలున్నాయి. చేపల మార్కెటింగ్ కోసం మినీ ఫిష్ రిటైల్ యూనిట్ కాస్ట్ రూ. లక్ష నుండి రూ. 3 లక్షల వరకు, రూ. 10 లక్షల నుండి రూ 50 లక్షల వరకు షాప్‌లకు ఫుడ్ ఐటమ్స్‌ను విక్రయించడానికి అనుమతులు ఇస్తున్నాం. ఎస్సీ, ఎస్టీ మహిళలకు 60 శాతం సబ్సిడీ, ఇతరులకు 40 శాతం సబ్సిడీతో ఇస్తున్నాం.

మత్స్య శాఖకు సంపాదన ఏవిధంగా పెంచుతున్నారు?

మత్స్యశాఖ ద్వారా రెండు రకాలు ఆదాయ పెంపుదలకు కృషి చేస్తున్నాం ప్రధానమంత్రి మత్స్య సంపద యువజన పథకం (పిఎంఎంఎస్) ద్వారా శాఖా పరంగా గుర్తించిన చెరువులలో సీడ్ చేసి, లైసెన్స్ రిజర్వాయర్లలోలో చేప పిల్లలను వదలడం ద్వారా చేపల వృద్ధి చెందడానికి చర్యలు చేపడుతున్నాం .

మత్స్య శాఖ ద్వారా ఎటువంటి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు?

చెరువులలో చేపల పెంపకం, రవాణా ద్వారా డ్రైవర్లకు, కూలీలకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. వీటితో పాటు మత్స్య కారులకు ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలను అమలు చేస్తున్నాం.

ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయాలి : 'గడికోట'

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

యోగా దైనందిక జీవితంలో భాగం కావాలని వైఎస్ఆర్‌సిపిఅన్నమయ్య జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని మున్సిపల్ డైట్ పార్క్‌లో వాసవి యోగాసన కేంద్రం, రోటరీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యోగ శిక్షణా కేంద్ర ప్రారంభంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు లతో కలసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రముఖ ఆధ్యాత్మిక యోగా గురువు తీడా రాముచే ప్రారంభమైన యోగ శిక్షణా తరగతులులో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎ సనాతన భారతదేశంలో పురుడుపోసుకున్న యోగా విద్య నేడు ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలలో అత్యంత ఆదరణ పొందుతోందన్నారు. యోగా ద్వారా మన శరీరంలో రోగ నిరోధక శక్తి పెంచుకుని ప్రస్తుత పరిస్థితులలో వస్తున్న జబ్బుల నుంచి మనలను మనం కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువత చిన్నతనం నుంచే యోగా శిక్షణలో తర్ఫీదు పొంది భారతదేశాన్ని ఆరోగ్యవంతమైన దేశంగా తయారు చేయాలని పిలుపునిచ్చారు. .డైట్ మున్సిపల్ పార్క్‌లో యోగా కేంద్రానికి మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. పదిరోజుల పాటు జరగనున్న యోగా శిక్షణా కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు .మున్సిపల్ డైట్ పార్క్ అభివృద్ధికి సహకరించిన మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, పాలక వర్గం, మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లుల కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ బయారెడ్డి, వృక్షరక్షణ సమితి అధ్యక్షుడు లయన్ తులసీశ్వర్ రెడ్డి, మానవతా షకీల్, యర్రపురెడ్డి బ్రహ్మానంద రెడ్డి, రోటరీ క్లబ్ కూనా కృష్ణదేవరాయులు, అష్రఫ్, కొత్త సుదర్శన్, నాయకులు కొలిమి ఖాన్ బాష, ఆర్ట్స్ శంకర్, జిల్లా వ్యవసాయ సలహా సంఘ సభ్యుడు దిన్నెపాడు రవిరాజు, పిరమిడ్ స్పిరుచువల్ సొసైటీ అధ్యక్షుడు సతీష్, సాయి ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ సుధాకర్ రెడ్డి,లయన్ మహాదేవపల్లె అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

గిరి చిత్రాలు అద్భుతం : డిప్యూటీ సిఎం

చిత్రకారుడు గిరి వేసిన చిత్రాలను వీక్షిస్తున్న డిప్యూటీ సిఎం అంజాద్‌బాషా

ప్రజాశక్తి- రాజంపేట అర్బన్

గిరిధర్ వేసిన చిత్రాలు అత్యద్భుతమని ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా పేర్కొన్నారు. నాయని గిరిధర్ జిఎంసి కల్యాణ మంటపంలో ఏర్పాటు చేసిన చిత్రకళ ప్రదర్శనను తిలకించేందుకు విచ్చేసిన అంజాద్‌బాషా ఆ చిత్రాలు చూసి ఆహ్లాద భరితుడయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక చిత్రంలోనే అనేక భావాలను స్ఫురింపజేస్తున్న గిరిధర్ చిత్రకళ నైపుణ్యత అమోఘమని అన్నారు. ఇంతటి ప్రతిభావంతుడు ఉమ్మడి జిల్లాలలో ఉండడం గర్వకారణమని తెలిపారు. గిరిధర్ నైపుణ్యానికి తగిన విధంగా తాను కోరిన ప్రాంతంలో ప్రదర్శన ఏర్పాటు చేసుకునేందుకు సహకరిస్తామని అన్నారు. ప్రతి చిత్రంలో ఓ సందేశం ఉండటంతో పాటు సహజత్వం ఉట్టిపడుతోందని అన్నారు. ఈ చిత్రాలు చూసిన తర్వాత మనసు ప్రశాంతమైందని తెలియజేశారు. కార్యక్రమంలో ఆయనతోపాటు మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులు రెడ్డి, వైస్ చైర్మన్ మర్రి రవి, మిరియాల సురేఖ, శ్రీ చైతన్య ప్రిన్సిపల్ ఆకేపాటి సుధాకర్ రెడ్డితో పాటు, చిత్రకళా ప్రదర్శనను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి కళాభిమానులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

ముస్లిముల శ్మశాన వాటిక అభివృద్ధికి కృషి చేయాలని ఆదివారం డిప్యూటీ సిఎం అంజాద్‌బాషాకు ముస్లిమ్ మైనార్టీలు వినతి పత్రం అందజేశారు. ఆదివారం స్థానిక జిఎంసి కల్యాణ మండపంలో చిత్ర కళా ప్రదర్శన సందర్శనార్థం విచ్చేసిన ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషకు రాష్ట్ర వేర్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ జాహిద్ అలీ ఆధ్వర్యంలో ముస్లిం మైనార్టీలు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలోని కారంపల్లి పంచాయతీలో ముస్లిములకు ప్రభుత్వం ద్వారా నూతనంగా మంజూరు చేసిన ముస్లిం శ్మశాన వాటికకు నిధులు మంజూరు చేసి అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మండల కో -ఆప్షన్ సభ్యులు గౌస్, కౌన్సిలర్ న్యామతుల్లా, పట్టణ మైనారిటీ అధ్యక్షులు మసూద్ అలీ, మున్నా పాల్గొన్నారు.

బిసిల అభ్యున్నతికి అందరూ సహకరించాలి

బిసి కుల గణన రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ఐక్యత చాటుతున్న బిసి సంఘాల నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె

రాష్ట్రంలో బిసి కుల జన గణనను పారదర్శకంగా చేపట్టి, రాజ్యాంగబద్ధంగా బిసిల అభ్యున్నతికి పార్టీలకు అతీతంగా అందరు న్యాకులు సహకరించాలని రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు పునరుద్ఘాటించారు. ఆదివారం పట్టణం లోని బెంగళూరు రోడ్డు నక్కలదిన్నె షటిల్ కోర్టులో వాల్మీకి సంఘం ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపకులు పులి శ్రీనివాసులు ఆధ్వర్యంలో బిసి కుల గణన అంశంపై రాజ్యాంగబద్ధ హక్కుకై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి వచ్చేసి పలు రాజకీయ పార్టీ నాయకులు, కుల సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ తరతరాలుగా బతుకు తెరువు కోసం కులవృత్తులపైనే ఆధారప డటం బిసిలు శాపగ్రస్తులుగా మారారని ఆవేదన వ్యక్తం చేశారు. భరతమాత ముద్దుబిడ్డలమైన బిసి సృజనాత్మకమైన తెలివితేటలను వెలుగులోకి తెచ్చి దేశ సమగ్రత, జాతీయ, సమాజాభివృద్ధికి కృషి చేయాలన్నారు. సమాజంలో అందరితో సమానంగా విద్యా, ఉద్యోగ, ఉపాధి, సామాజిక, రాజకీయ రంగాలలో ముందుకు నడిపించే నైతిక బాధ్యత ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలపై ఉందని వారు తెలిపారు. ఈ విషయాలన్నిటిని సమగ్రంగా చర్చించి ప్రభుత్వాల దృష్టికి తీసుకుని వెళ్లాలని నిర్ణయించారు. జనసేన రాయలసీమ కో కన్వీనర్ రాందాస్ చౌదరి, ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల శివరాం, తెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంట్ జనరల్ సెక్రెటరీ దొరస్వామి నాయుడు , తెలుగుదేశం నాయకులు ఆర్జే వెంకటేష్ , కాంగ్రెస్ పార్టీ నాయకులు రెడ్డి సాహెబ్ , సోషల్ మీడియా మహమ్మద్ రఫీ, సేవాదళ్ ప్రెసిడెంట్ షేక్ మహమ్మద్ అలీ,- భారతీయ అంబేద్కర్ సేన లక్ష్మీనా రాయణ సార్ , రెడ్డప్ప, బిసివై పార్టీ రమేష్ యాదవ్ , ఈడిగ సంఘం అధ్యక్షులు కె. కృష్ణప్ప , భీమ్ సేఫ్ అధ్యక్షులు చిట్టిబాబు సార్ , వాల్మీకి సంఘం ఉపాధ్యక్షుడు సద్దల జయసింహ, మదనపల్లి టౌన్ అధ్యక్షుడు వలసల మంజునాథ్, అరవనిర్మాలమ్మ , నాయని జగదీష్, అడప సురేంద్ర ,కే రెడ్డమ్మ, గజ్జల రెడ్డప్ప, దేవా , మునగ మానురెడ్డి, శేఖర్ పాల్గొన్నారు

వైసిపి పాలనలో రాజ్యాంగం అపహాస్యం : 'బత్యాల'

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బత్యాల చెంగల్‌రాయుడు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాజ్యాంగం అవహాస్యం పాలవుతోందని, ముఖ్యంగా బిసిలపై పేట దాడి జరుగుతోందని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్యాల చెంగల్‌రాయుడు ఆవేదన చెందారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఆర్‌అండ్‌బి అతిథి గృహం వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో బత్యాల మాట్లాడుతూ జగన్ రెడ్డి పాలనలో 74 మంది బలహీన వర్గాలు హత్యకు గురయ్యారని ఆరోపించారు. తెలుగుదేశం పార్టీలోని 5 వేల మంది బడుగు బలహీన వర్గాలపై అక్రమ కేసులు బనాయించి వేధించారని, రాజ్యాంగం ప్రకారం నోటీసులు ఇచ్చి అరెస్టు చేయాల్సి ఉండగా జగన్ రెడ్డి రాజ్యాంగ ధిక్కరణతో ముందస్తు నోటీసులు ఇవ్వకుండానే గోడ దూకి పోలీసులతో అచ్చన్నాయుడును అరెస్టు చేశారని తెలిపారు. యనమల రామకృష్ణుడు, కొల్లు రవీంద్ర, కళా వెంకట్రావు వంటి వారిపై అక్రమ కేసులతో వేధింపులకు గురి చేశారని అన్నారు. బడుగు బలహీన వర్గాలపై కిరాతక, పైశాచిక చర్యలతో వారి సంక్షేమాన్ని, అభివృద్ధిని నిరోధిస్తూ పూర్తిగా అనచివేశారని తెలిపారు. గత టిడిపి ప్రభుత్వంలో అందిస్తున్న 30 రకాల చేతివృత్తుల వారికి సామాగ్రి నిలుపుదల చేశారని, రూ.76 వేల కోట్ల సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లించి బలహీన వర్గాలకు ఒట్టి చేయి చూపించారని ఆరోపించారు. నవరత్నాల అమలు కోసం అన్ని వర్గాల సంక్షేమ నిధులను దారిమళ్లిస్తున్నారని అన్నారు. రూ .11 లక్షల కోట్లు అప్పు చేసి రాష్ట్రాన్ని దివాలా తీసేలా వ్యవహరిస్తున్నారని తెలిపారు. టిడిపి అధికారంలోకి రాగానే అన్ని వర్గాల వారి సబ్ ప్లాన్ నిధులు పునరుద్ధరణ చేసి వారి అభివృద్ధికి అన్ని విధాల తోడ్పాటు అందిస్తామని వివరించారు. అనంతరం బడుగు బలహీన వర్గాల ప్రజలపై జగన్మోహన్ రెడ్డి చేసిన అరాచకాలు, అన్యాయాలకు సంబంధించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చెన్నూరు సుధాకర్, మాజీ రాష్ట్ర బిసి కార్య నిర్వాహక కార్యదర్శి ఇడిమడకల కుమార్, పట్టణ అధ్యక్షులు డి.ఆర్.ఎల్ మణి, ఎస్‌సి సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మందా శ్రీనివాసులు, జడ శివ పాల్గొన్నారు.

గౌరవ వందనం స్వీకరిస్తున్న వైస్ ప్రిన్సిపల్

'మిట్స్'లో ఘనంగా ఎన్‌సిసి దినోత్సవం

ప్రజాశక్తి-మదనపల్లె

అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం ఉదయం 75వ ఎన్‌సిసి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సి. కమాల్ బాషా మాట్లాడుతూ ప్రతి సంవత్సరమూ నవంబరు చివరి ఆదివారం ఎన్‌సిసి దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామన్నారు. 1948 జూన్ 15న నేషనల్ కేడెట్ కార్ప్స్ చట్టం ద్వారా ఈ దినోత్సవం ఏర్పడిందన్నారు. ఐక్యతతో, క్రమశిక్షణతో అందరు కట్టుబడి ఉండాలని, స్నేహభావంతో ముందుకు సాగాలని అన్నారు. ప్రతి కేడెట్ సేవా దృక్పథం కలిగి ఉండాలని, దేశానికి సమస్య వచ్చినప్పుడు ఓ సైనికుడిలా మారాలని ఆయన అన్నారు. ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఎన్‌సిసి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అత్యవసర సమయాలలో సేవలు అందించేందుకు ఎన్‌సిసి కేడెట్ సిద్ధంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో లెఫ్టనెంట్ డాక్టర్ నవీన్ కుమార్, ఎన్‌సిసి కేడెట్లు పాల్గొన్నారు.

స్థానిక బిసెంట్ థియోసాఫికల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం ఎన్‌సిసి దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ డి శ్రీనివాసులు హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కళాశాలకు చెందిన కేడెట్లు, సిటిజలు పాల్గొన్నారు.

'ఆదర్శ మున్సిపాలిటీ అంటే ఇదేనా?'

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

జిల్లా కేంద్రమైన రాయచోటి మున్సిపాల్టీలో పారిశుధ్య నిర్వహణ గాడి తప్పిందని, పట్టణంలో ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం దర్శన మిస్తోందని, ఉన్న కాలువలు పూడికలతో నిండి కంపుకొడుతున్నాయని, పారిశుధ్యం పడకేసినా అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమని డిసిసి మైనార్టీ అధ్యక్షులు ఆడిటర్ మన్సూర్ అలీఖాన్ పేర్కొన్నారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో ఆయన డిసిసి ఉపాధ్యక్షుడు దర్బార్ బాష, మాజీ పట్టణ అధ్యక్షుడు ఫారుక్ లతోకలసి పర్యటించారు. ఈ సందర్భంగా మన్సూర్ అలీఖాన్ మాట్లాడుతూ గ్రేడ్ వన్, ఆదర్శ మున్సి పాలిటీ అంటే ఇదేనా? అని ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సుమారుగా 90 వేల మంది ఓటర్లు ఉన్న మున్సి పాలిటీ పరిధిలోని 36 వార్డుల లో కొన్ని వార్డులైతే అధ్వానంగా ఉన్నాయని చెప్పారు. సిసి రోడ్లు, సైడ్ కాల్వలు లేవని, మట్టిరోడ్లు గుంతలమయం కావడంతో రాత్రుళ్ళ కరెంట్ పోతే పాదచారులు, ద్విచక్రవాహనదారులు గుంతల్లో పడి గాయాలపాలవుతున్నారని చెప్పారు. 9వ వార్డులో వెంటనే మౌలిక వసతులు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. పారిశుధ్య పనులు సక్రమంగా జరగడం లేదన్నారు. పర్యవేక్షణ లోపమే ఇందుకు కారణమని తెలిపారు. ప్రధానంగా వార్డుల్లోఎప్పటికప్పుడూ చెత్తాచెదారాలను తొలగించడం లేదని వాపోయారు. ముస్లిం మైనార్టీల ఓట్లతో అధికారాన్ని చేపట్టి పదవులను అనుభవిస్తున్న ప్రజాప్రతినిధి, నాయకులు, ప్రజా సమస్యలను గాలికి వదిలేశారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే నిజమైన ఆదర్శ మున్సిపాలిటీ ఎలా ఉంటుందో పట్టణ ప్రజలకు చూపిస్తామన్నారు.

వార్డుల్లో పర్యటిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అంతర్ జిల్లా క్రీడల్లో 'గురుకులం' విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి-పీలేరు

ఆంధ్రప్రదేశ్ ఎస్‌టిఎఐఆర్ఎస్ నిర్వహించిన అంతర్ జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో పీలేరు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల బాలికల విద్యాలయం విద్యార్థినులు తమ సత్తా చాటారు. ఆదివారం గురుకుల విద్యాలయం ప్రిన్సిపల్ జి. బేబీ కరుణ మాట్లాడుతూ ఈ నెల 19, 20 తేదీల్లో చిత్తూరు జిల్లా, అరగొండలోని ఇషా విద్యానికేతన్ స్కూల్ ప్రాంగణంలో అంతర్ జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారన్నారు. ఈ సందర్భంగా అండర్ -19, అండర్ -17 విభాగాల్లో జరిగిన ఫుట్ బాల్, కబడ్డీ పోటీల్లో పీలేరు విద్యార్థినులు 40 మంది పాల్గొన్నారన్నారు. పోటీల్లో పాల్గొన్న వారిలో 28 మంది విద్యార్థినులు ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాలను, 12 మంది విద్యార్థినులు ద్వితీయ స్థానంలో నిలిచి వెండి పతకాలను సొంతం చేసుకున్నారని ప్రిన్సిపాల్ తెలియజేశారు. విజేతలను ప్రిన్సిపాల్ , వైస్ ప్రిన్సిపాల్ వి. సుజాత, వ్యాయామ ఉపాధ్యాయిని పుష్పలత, సిరీన్, మీనాక్షి, శివలక్ష్మి, నిరంజని విద్యార్థినులను అభినందించారు.



ప్రతిభ సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు

ఐదుగురు ఎస్ఐలు బదిలీ

ప్రజాశక్తి- రాయచోటి

జిల్లా పరిధిలో ఐదుగురు ఎస్ఐలను బదిలీ చేస్తూ ఎస్‌పి బి.కృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. రాయచోటి ట్రాఫిక్ ఎస్ఐగా పనిచేస్తున్న మహమ్మద్‌రఫీ, మదనపల్లెవన్ టౌన్‌కు బదిలీ చేశారు. రాయచోటి అర్బన్ పిఎస్‌లో రిజర్వ్‌డ్ ఎస్ఐగా పనిచేస్తున్న ఇనాయతుల్లా, మదనపల్లి వన్‌టౌన్‌కు, నంద్యాల జిల్లా జూపాడు బంగ్లాలో పనిచేస్తున్న ఎస్ఐ సి.వెంకటసుబ్బయ్యను మదనపల్లె టూటౌన్ స్టేషన్‌కు, చిత్తూరు జిల్లా చౌడేపల్లి ఎస్ఐగా పనిచేస్తున్న రవికుమార్‌ను మదనపల్లె తాలూకా పోలీస్ స్టేషనుకు, మదనపల్లి తాలూకా పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న పి.వెంకటేశును రాయచోటి ట్రాఫిక్‌కు బదిలీ చేస్తూ ఎస్‌పి ఆదేశాలు జారీ చేశారు.

'స్ర్కాప్' నూతన కమిటీ ఏర్పాటు

రాయచోటి : నియోజకవర్గ స్ర్కాప్ షాప్ యజమానుల వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక ఆదివారం పట్టణ పరిధిలోని గున్నికుంట్ల రోడ్డులో నిర్వహించారు. స్ర్కాప్ షాప్ యజమానుల వెల్ఫేర్ అసోసియేషన్ రాయచోటి నియోజకవర్గ అధ్యక్షులుగా ఎస్.మహమ్మద్, ఉపాధ్యక్షులుగా జబీవుల్లా, జనరల్ సెక్రటరీగా అబ్జల్ బాష, జాయింట్ సెక్రటరీగా అల్లాబకష్, కోశాధికారిగా జమీర్, కార్యవర్గ సభ్యులుగా సాదిక్, కాలేషా, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన రాయచోటి స్ర్కాప్ షాప్ యజమానుల వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ సమావేశంలో అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ స్ర్కాప్ యజమానుల అసోసియేషన్ ధర శాంతియుత మార్గంలో సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. స్ర్కాప్ యజమానుల సమస్యలను ఎప్పటికప్పుడూ సంబంధిత అధికారులకు దృష్టికి తీసుకెళ్లడం ద్వారా పరిష్కరిస్తామన్నారు.ేఎద వ్యాపారాలను గుర్తించి మానసికంగా అణగారిన వృద్ధాప్యంలో ఉన్న వృద్ధులను గుర్తించి వారి సమస్యల పరిష్కారానికి ఆర్థికంగా సహాయం చేయడంలో ముందుంటామన్నారు.

మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న గంటానరహరి

మహిళలకు చీరలు వితరణ

ప్రజాశక్తి-వీరబల్లి

గంటా నరహరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గుదె నాగార్జున నేతృత్వంలో మండలంలోని సోమవరం పంచాయతీ, వంగిమళ్ళ పెద్ద మాదిగ పల్లె, సానిపాయి పంచాయతీలో వెయ్యి మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజంపేట పార్లమెంటు టిడిపి అభ్యర్థి గంటా నర హరి మాట్లాడుతూ తమ ట్రస్ట్ తరుపున మహిళలకు చీరలు పంపిణీ చేయడం సంతోషాన్ని ఇచ్చిందన్నారు. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో దాడులు, అరాచకాలు పెరిగిపోయాయని ఆరోపించారు. టిడిపి నేతలను టార్గెట్ చేసు అక్రమ కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల సంక్షేమం, బాగోగులపై పెడితే బాగుం టుందన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టిడిపిని ఆదరించి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు వెంకటసుబ్బయ్య నాయుడు, మహిళలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై వేధింపులు తగవు

ప్రజాశక్తి-కలికిరి

ఉపాధ్యాయులపై వేధింపులు తగవని ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రకరకాల విద్యేతర కార్యక్రమాలు, యాప్‌ల భారం, నాడు-నేడు పనులు బాధ్యత ఆన్‌లైన్ నివేదికలతో ఉపాధ్యాయులు ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. ఏకోపాధ్యాయులతో కొనసాగిస్తూ అధిక సమయం వృధా చేస్తూ, సెమిస్టర్ వారీ అధిక సిలబస్ తో ఉపాధ్యాయులు సతతమౌతుంటే పర్యవేక్షణ పేరిట చిన్న చిన్న కారణాలకే శిక్షలు విధించడం కక్షసాధింపు చర్యలుగానే భావిస్తున్నామని అన్నారు. ఉపాధ్యాయులు అత్యవసరాలకూ సెలవు తీసకునేందుకు వీలుకాని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు అవసరాలకు పెట్టుకున్న పిఎఫ్, ఎపిజిఎల్ఐ రుణాలు, డిఎ, పిఆర్‌సి బకాయిలు ఊసెత్తకుండా సంవత్సరాల పెండింగ్ పెడుతూ నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ఇలాంటి పరిస్థితి కొనసాగిస్తే ఆందోళనబాట తప్పదన్నారు.

సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులుగా లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

ఉమ్మడి కడప జిల్లా సర్పంచ్‌ల సంఘం కమిటీ అధ్యక్షుడిగా అన్నమయ్య జిల్లా కోనంపేట సర్పంచ్ లక్ష్మీనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సర్పంచ్‌ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు యలమంచిలి రాజేంద్రప్రసాద్ ప్రకటించారు. ఆదివారం తిరుపతిలో కోలా రెసిడెన్సీలో జరిగిన రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం సమావేశంలో ఆయన ఈ విషయం వెల్లడించారు. జిల్లా కమిటీ అధ్యక్షుడుగా నన్ను ఎన్నుకు న్నందుకురాజేంద్రప్రసాద్‌కు, రాయచోటి టిడిపి ఇన్‌ఛార్జి అర్.రమేశ్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

హెల్త్ కార్డులు పంపిణీ

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని గువ్వలచెరువు, కసిడ్డిగారిపల్లి, సూర్యనారాయణపురం గ్రామంలోని సచివాలయంలో ఆదివారం ఎంపిడిఒ హైదర్‌వల్లి అధ్యక్షతన భారతసంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఒ డాక్టర్ కొండయ్య పాల్గొని లబ్ధిదారులకు ప్రధానమంత్రి జనఆరోగ్య యోజన హెల్త్ కార్డులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే అతి పెద్ద ఇన్సూరెన్స్ పథకం పిఎంజెఎవైఅని ఈ ఇన్సూరెన్స్ వల్ల ప్రతీ కుటుంబానికి ఐదు లక్షల భీమా వర్తిస్తుందని తెలిపారు. వైద్య శిబిరము నిర్వహించి 189 మందికి చికిత్స చేసి మందులు పంపిణీ చేశారు. క్షయ వ్యాధి స్క్రీనింగ్‌లో అనుమానితులను 19 మందిని పరీక్షల నిమిత్తం రెఫర్ చేశామన్నారు. టిబి.ముక్త్ భారత్ క్షయ రోగులకు పరీక్షలు, మందులు పూర్తిగా ఉచితంగా ఇస్తామని చికిత్స కాలంలో మంచి పౌష్టికాహారం నిమిత్తం రోగికి రూ.500 వారి ఖాతాలో జమ చేస్తామని చెప్పారు. దాతల సహకారముతో టిబి రోగులను దత్తత తీసుకోవడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రత్నమ్మ, ధనలక్ష్మి.మార్కెట్ ఛైర్మన్ విశ్వనాథ రెడ్డి, డిఎల్‌పిఒ హరినారాయణ, వైద్యాధికారి వినోద్‌కుమార్, ఇఒపిఆర్‌డి ఉషారాణి, నాయకులు రేఖంనారాయణ, శివయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

యువతతోనే దేశాభివృద్ధి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఆరోగ్యవంతమైన యువత దేశాభివృద్ధికి ఎంతో అవసరమని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి అన్నారు. శుక్ర, శనివారాల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఓపెన్ జెకెడి కుంగుపూ కరాటే ఛాంపియన్‌షిప్ 2023 పోటీ ప్రొద్ద టూరులో జరిగాయి. విజేత లకు ఎమ్మెల్యే ఆదివారం స్థానిక జార్జిక్లబ్‌లో బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మరక్షణ, దేహదారుఢ్యం, మానసిక వికాసానికి యువత ఇలాంటి క్రీడల పట్ల ఆసక్తిని కలిగి ఉండి విజేతలుగా రాణించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, కుంగుపూ మాస్టర్ సొహైల్, విజేతల తల్లిదండ్రులు, ఔత్సాహికులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

-పెనికలపాడు వైసిపి నాయకులు అట్ల భాస్కర్‌రెడ్డి

ప్రజాశక్తి - ముద్దనూరు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారని పెనికలపాడు వైసిపి నాయకులు అట్ల భాస్కర్‌రెడ్డి, ఉప సర్పంచ్ అట్ల భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. 'ప్రజాశక్తి'తో వారు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కులమతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలను అందిస్తూ జగన్ అండగా నిలుస్తున్నారన్నారు. రాష్ట్రాభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. ప్రజల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నట్లు చెప్పారు. పారదర్శకంగా పాలన సాగిస్తూ ఆదర్శ ముఖ్యమంత్రిగా జగన్ పేరు తెచ్చుకున్నారని వారు కొనియాడారు. ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా తీర్చి దిద్దుతున్నారన్నారు. సిఎం, ఎంపీ అవినాష్‌రెడ్డి సహాయ సహకారాలతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి జమ్మలమడుగు నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి పాటు పడుతున్నారన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేస్తామన్నారు. గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాల అభివృద్ధికి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. వైసిపి బలోపేతానికి అహర్నిశలు పాటుపడుతామన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపి మళ్ళీ అధికారంలోకి వచ్చేందుకు శాయిశక్తులా కృషి చేస్తామని వారు తెలిపారు. వైసిపి ప్రభుత్వం ప్రజలదని సిఎం జగన్ నిరూపించారన్నారు.

గుడిపాడులో భోజనశాల ప్రారంభం

ప్రజాశక్తి - దువ్వూరు

మండల పరిధిలోని గుడిపాడు గ్రామంలో ఉన్న శ్రీ సీతారాముల దేవస్థానం ఆవరణలో భోజనశాలను ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మైదుకూరు ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి, మైదుకూరు టిడిపి ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విజయవాడలో ఉన్న గుడిపాడు గ్రామానికి చెందిన ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి తన తల్లిదండ్రుల పేరుతో భోజనశాల నిర్మించడం చాలా సంతోషంగా ఉందని వారన్నారు. కార్యక్రమంలో రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, ప్రముఖులు పాల్గొన్నారు

నేడు మైదుకూరులో జాబ్ మేళా

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు పురపాలక పరిధిలో సోమవారం ఎంపిడిఒ కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రంగస్వామి తెలిపారు. డిక్సన్ కంపెనీలో అసెంబల్ అసిస్టెంట్ పోస్ట్‌లకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 10వ తరగతి పాస్ అయిన మహిళలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. మైదుకూరు నుండి కొప్పర్తి పారిశ్రామికవాడ వరకు బస్సు సౌకర్యంతోపాటు రూ.15వేల వేతనం ఇస్తారన్నారు. మైదుకూరు పురపాలక పరిధిలోని మహిళా అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

ప్రపంచ దేశాలుకు భారత రాజ్యాంగం ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ నిర్దేశకత్వంలో 1949 నవంబర్ 26న భారత రాజ్యాంగం సిద్ధమైందన్నారు. దేశాభివృద్ధిలో రాజ్యాంగమే కీలకపాత్ర పోషించిందని, భారత ప్రజల ఆకాంక్షలకు ప్రతీకగా రాజ్యాంగం నిలిచిందన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులతో పాటు, విధులను కూడా అనుసరిస్తూ జీవించడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని, రాజ్యాంగంపై అవగాహన పెంపొందించుకోవాలని, రాజ్యాంగాన్ని కాపాడుకోవడమే దేశభక్తికి ప్రతీక అన్నారు.ఈ సందర్భంగా భారత రాజ్యాంగ దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. **ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో..** ప్రపంచ దేశాలకు భారత రాజ్యాంగం ఆదర్శమని ఎంఆర్‌పిఎస్ కో-కన్వీనర్ రామాంజనేయులు పేర్కొన్నారు.తహశీల్దార్ కార్యాలయ సమీపంలో ఉన్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఫ్లెక్సీకి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో భారతీయ అంబేద్కర్ సేన ప్రధాన కార్యదర్శి పల్లం తాతయ్య, బీసీ నాయకులు కృష్ణయ్య, ఎంఆర్పిఎస్ నాయకులు లక్ష్మయ్య ,సురేష్ ,రెడ్డయ్య, శ్రీనివాసులు, జర్నలిస్టులు సునీల్ ఈశ్వరయ్య , బాస్ నాయకులు రమేష్, మాల మహానాడు నాయకులు పామయ్య, రామకృష్ణ, పాల్గొన్నారు. **నందలూరు :** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయసాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జంబుసూర్యనారాయణ, రైల్వే మెడికల్ అధికారి జయభాస్కరరావు అన్నారు. ఆదివారం రాజ్యాంగ దినోత్సవం పరిష్కరించుకొని నందలూరు బస్టాండ్ కూడలిలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సందర్భంగా మాట్లాడుతూ భాకరత రాజ్యాంగాన్ని ప్రపంచ దేశాలు స్ఫూర్తిగా తీసుకొని ఆ బాటలో పయనిస్తున్నాయన్నారు. కేర్యక్రమంలో సర్పంచ్ రాము, పెనుబాల నాగ సుబ్బయ్య, ఆర్ముగం, విశ్వనాథ్, శ్రీనివాసులు పాల్గొన్నారు. **పీలేరు:** రాజ్యాంగాన్ని గౌరవించడం మనందరి కర్తవ్యమని ఐసిఇయు ఉద్యోగుల సంఘం నాయకులు తెలిపారు. పీలేరు ఎల్ఐసి బ్రాంచ్ కార్యాలయం ముందు ఉద్యోగులు భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఆచరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ పౌరులందరికీ సమాన హక్కులు, సమాన అవకాశాలు అనే సిద్ధాంతంతో, 69 ఏళ్ళ క్రితం మన దేశ రాజ్యాంగం రూపుదిద్దుకుందని అన్నారు. 1949 నవంబర్ 26న రాజ్యాంగ సభ సభ్యులు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని ఆమోదించారన్నారు. కార్యక్రమంలో ఎల్ఐసి పీలేరు బ్రాంచ్ ఐసిఇయు ఉద్యోగులు బి. శ్రీనివాసులు, పి. మోషే, ఎన్ఎస్ రఘురాము, సోమశేఖర్, డి.ఉపేంద్ర రెడ్డి పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** భారత రాజ్యాంగ దినోత్సవాన్ని భారతీయ అంబేద్కర్ సేన ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలో స్థానిక జ్యోతి బస్టాండు కూడలిలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.భారతీయ అంబేద్కర్ సేన (బాస్) మండలకమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా బాస్ సీనియర్ నాయకులు సచిన్, జిల్లా కార్యదర్శి సింగన్న, డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బాస్ మండల అధ్యక్షులు పలక వెంకటేష్, తంబళ్లపల్లి నియోజకవర్గం ప్రచారకార్యదర్శి కొగర మాధవ, టౌన్‌అధ్యక్షుడు టౌన్ అధ్యక్షులు మణి, శీన, రవి, కోగరవెంకటేష్ పాల్గొన్నారు. **మదనపల్లె :** భారత రాజ్యాంగం పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ ఆర్.గురు ప్రసాద్ పేర్కొన్నారు. రాజ్యాంగ దినోత్సవంపై విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎస్.రమాదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు. **కలికిరి :** అంబేద్కర్ యువజన సంఘం, ఎస్‌సి ఎంప్లాయిస్ యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో రాజ్యాంగ ఆమోద దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనది అతి పెద్ద ప్రజాస్వామ్యమని దేశాన్ని ఒకే తాటిపై నడిపించే రాజ్యాంగమని మన రాజ్యాంగాన్ని ఆమోదించబడి ఇప్పటికి 73 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, జయరాం, అగస్తీశ్వర్, అశోక్ కుమార్, శ్రీనివాసవర్మ, మల్లయ్య, యేసురాజు, రాఘవరెడ్డి , బుజ్జి , రాంబాబు , గోపి పాల్గొన్నారు. **పీలేరు :** పీలేరు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఆదివారం పీలేరు అంబేద్కర్ సర్కిల్లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నీలి జెండాను ఎగురవేసి రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ 1949 నవంబర్ 26న రాజ్యాంగాన్ని అంబేద్కర్ పార్లమెంటుకు సమర్పించారన్నారు. 1950 జనవరి 26న రాజ్యాంగం అమల్లోకి వచ్చిందన్నారు. రాజ్యాంగాన్ని ఆమోదించిన నవంబర్ 26న అంబేద్కర్ జ్ఞాపకార్థం రాజ్యాంగ దినోత్సవం జరుపుకునే వారన్నారు. 1979 నుండి డాక్టర్ ఎంఎల్ సింగ్వి ఆధ్వర్యంలో నవంబర్ 26 రాజ్యాంగ దినోత్సవం రోజున సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయ దినోత్సవంగా జరుపుకోవడం మొదలైందన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్, రాయలసీమ జిల్లాల సహాయ కార్యదర్శి నగరిమడుగు సుభాష్, జిల్లా ఉపాధ్యక్షులు జెట్టి మల్లికార్జున, ముస్లిమ్ జెఏసి నాయకులు పఠాన్ మౌలా, షేక్ అమీరుల్లా పాల్గొన్నారు.

నందలూరు : అంబేద్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న సర్పంచ్ జంబు సూర్యనారాయణ

అంబేద్కర్ విగ్రహం ఎదుట నినాదాలు చేస్తున్న బాస్ నాయకులు

15 నుంచి 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలు

నేటి నుంచి సచివాలయాల్లో పేర్లు నమోదు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

15 ఏళ్ల పైబడిన వారి కోసం డిసెంబరు 15 నుంచి ఆడదాం ఆంధ్ర పేరుతో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ కృష్ణమూర్తి తెలిపారు. ఆ మేరకు శనివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రికెట్, వాలీబాల్, కోకో, కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రీడాకారులు ఈనెల 27వ నుంచి సచివాలయాల్లో రిజిస్ట్రేషన్‌ను చేయించుకోవాలన్నారు. 15 ఏళ్లు పైబడిన గ్రామీణ ప్రాంత క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ క్రీడా పోటీలు డిసెంబర్ 15 నుంచి 20 తేదీ వరకు సచివాలయ పరిధిలో ఉంటాయన్నారు. 21 నుంచి జనవరి 4వ తేదీ వరకు మండల స్థాయిలోనూ, జనవరి 5 నుంచి 10వ తేదీ వరకు నియోజవర్గ స్థాయిలోనూ, జనవరి 11 నుంచి 21 వరకు జిల్లాస్థాయిలో, జనవరి 22 నుంచి 26 వరకు రాష్ట్రస్థాయిలో పోటీలు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని గ్రామీణ ప్రాంత క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ కోరారు.

ప్రభుత్వ కళాశాల్లో ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారులు..

ప్రభుత్వం నిర్వహించనున్న ఆడదాం ఆంధ్ర క్రీడ పోటీల్లో పాల్గొనడానికి కళాశాల విద్యార్థులు ఆయా క్రీడల్లో ప్రావీణ్యం పొందేందుకు ప్రాక్టీస్ చేస్తున్నారు. నిడివెలగల సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్ని కళాశాలలో విజయం సాధించాలని లక్ష్యంతో ఆయా క్రీడల్లో ప్రాక్టీస్ చేస్తున్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారులు

వెంకన్న సాక్షిగా ఇచ్చిన హామీలు అమలు చేయని మోడీ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

రాష్ట్ర విభజన తర్వాత ఎన్నికల్లో తిరుపతి వెంకన్న సాక్షిగా ప్రత్యేకహోదా, కడప ఉక్కును ఇస్తామని నరేంద్ర మోడీ, అమిత్ షా చెప్పి మాట తప్పారని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలిపారు. స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ఎన్నికల ప్రచారంలో భాగంగా తిరుపతి సాక్షిగా బిజెపి అధికారంలోకి వస్తే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామని, కడప ఉక్కు తెస్తామని హామీలిచ్చారని గుర్తు చేశారు. వాటిని ఇప్పటివరకు ఎందుకు అమలు చేయలేదో చెప్పి, రాష్ట్ర ప్రజలకు క్షమాపణలు చెప్పాలన్నారు. మళ్లీ ఇప్పుడు ప్రధాని మోడీ తిరుపతికి రావడం ఇక్కడి ప్రజలను మరోమారు మోసం చేయడమేనని విమర్శించారు. కర్నూల్‌లో చేసిన బిజెపి రాయలసీమ డిక్లరేషన్ ఏమైందన్నారు. కరువు కోరల్లో చిక్కుకున్న రాయలసీమ ప్రాంతం విముక్తి కడప ఉక్కు పరిశ్రమ అన్నారు. ఉక్కు పరిశ్రమపై కేంద్రం శీతకన్ను వేసిందన్నారు. ఎదిరించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం వద్ద మెడలు వంచి స్వప్రయోజనాల కోసం రాష్ట్ర భవిష్యత్‌ను తాకట్టు పెడుతోందన్నారు. సమావేశంలో డివైఎఫ్ఐ పట్టణ ఉపాధ్యక్షులు ప్రసాద్, మహేష్ పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న శివకుమార్

మాట్లాడుతున్న కత్తి నరసింహారెడ్డి

ఒపిఎస్ అమలు చేసేవారికే మద్దతు

ప్రొద్దుటూరు : ఒపిఎస్ అమలు చేసే వారికే తమ మద్దతుంటుందని మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి అన్నారు. స్థానిక ఎన్జీఓ హోంలో ఆదివారం ఎస్టీయు రీజనల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వారంలోనే సిపియస్ రద్దు చేసి ఒపిఎస్‌ను అమలుచేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి మాట తప్పారని తెలిపారు. 30ఏళ్లకు పైబడి ప్రభుత్వానికి, ప్రజలకు సేవ చేసిన ఉద్యోగులు ఉద్యోగ విరమణ తర్వాత జీవితాలకు భద్రత కల్పించే పెన్షన్ ఇవ్వడం ప్రభుత్వాల బాధ్యత అని చెప్పి, ఇప్పుడు ఆరోజు అవగాహన లేక హామీ ఇచ్చామని మాటమార్చడం అన్యాయమన్నారు. తమ న్యాయమైన కోరికను అంగీకరించకపోతే మరో ఛలో విజయవాడ వంటి ఉద్యమాలు పునరావృతమవుతాయని హెచ్చరించారు. రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి మాట్లాడారు. అనంతరం ప్రొద్దుటూరు రూరల్, అర్బన్, రాజుపాలెం, చాపాడు మండలాలకు నూతన కార్యవర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. రీజనల్ కన్వీనర్ డి.సలీం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

అలరించిన చిన్నారుల నృత్యాలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పట్టణంలోని శిల్పారామంలో చిన్నారుల నృత్యాలు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి. ఆదివారం సాయంత్రం శ్రీ సూర్య డాన్స్ అకాడమీ మదనపల్లె వారి చిన్నారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయ. కార్యక్ర మంలో శిల్పారామం పరిపాలన అధికారి సుధాకర్, మా ఊరు సినిమా హీరో మహేష్, డ్యాన్స్ మాస్టర్ సూర్య పాల్గొన్నారు.

29న సహాయ పరికరాలు అందజేత

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సహకారంతో పులివెందుల నాలుగు రోడ్ల కూడలి, గాంధీ సర్కిల్ సమీపంలోని అహోబిలపురం మెయిన్ ఉన్నత పాఠశాలలో ఈనెల 29న విభిన్నప్రతిభావంతులకు సహాయ పరికరాలు పంపిణీ శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో దాదాపు 7వందల మందికి పైగా అందజేస్తారని తెలిపారు. అర్హుల వివరాలు సచివాలయాలు, వాలంటీర్లు, ఎంపిడిఒ వద్ద ఉంటాయన్నారు. నియోజకవర్గంలోని పులివెందుల మున్సిపాలిటీ, రూరల్, లింగాల, తొండూరు, వేముల, వేంపల్లి, చక్రాయపేట మండలాల లబ్ధిదారులు హాజరుకావాలన్నారు. వివరాలకు 92473 39815 సెల్ నంబర్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

పతకాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపల్, పీడీ

తేక్వాండోలో మోడల్‌స్కూల్ విద్యార్థినులకు పతకాలు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని ఆదర్శ పాఠశాలలో పదవ తరగతి విద్యను అభ్యసిస్తున్న విద్యార్థిని జె.నిఖిత రైల్వే కోడూరులో జరిగిన 67వ రాష్ట్రస్థాయి తేక్వాండో పోటీలలో పాల్గొని అద్భుత ప్రతిభ కనబరిచి 63-68 కేజీల విభాగంలో సిల్వర్ మెడల్ సాధించారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపిసి చదువుతున్న జి. భార్గవి అద్భుత ప్రతిభ కనబరిచి 44-46 కేజీల విభాగంలో సిల్వర్ మెడల్, తేజస్విని 42-44 కేజీ విభాగంలో అద్భుత ప్రతిభ కనబరిచి బ్రౌన్ మెడల్ సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ లీలాశ్రీహరి, పీడీ నీలకంతరావు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ అమ్మాయిలు చదువులోనే కాకుండా క్రీడల్లో కూడా అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి, జాతీయస్థాయిలో మెడల్స్ సాధించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. క్రీడల్లో సాధించిన సర్టిఫికెట్స్ ఉద్యోగ సమయంలో ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు.

ఇంటింటి ప్రచార కార్యక్రమంలో టిడిపి నాయకులు

సంక్షేమ పాలన టిడిపితోనే సాధ్యం

ప్రజాశక్తి-పుల్లంపేట

ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడుని గెలిపిస్తే ప్రతి ఒక్క కుటుంబంలో భవిష్యత్తుకు గ్యారంటీ ఉంటుందని టిడిపి మహిళా నాయకులు దుద్యాల అనిత దీప్తి పేర్కొన్నారు. మండలంలోని టి.కమ్మపల్లి, టి.బలిజపల్లి దళితవాడలో ఆదివారం బాబుష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అనిత దీప్తి గడపగడప తిరిగి ప్రతి ఇంటింటికి వెళ్ళి చంద్రబాబునాయుడు విడుదల చేసిన కరపత్రాలను పంపిణీ చేశారు. టిడిపి, జనసేన ప్రభుత్వం ఏర్పడిన నుండి ప్రతి కుటుంబానికి ఇటువంటి వివక్షత నిబంధనలు లేకుండా సూపర్ సిక్స్ ద్వారా నగదు బదిలీ చేయబడుతుందని తెలిపారు. సైకో పోవాలి సైకిల్ రావాలి అనే నినాదం ప్రజల్లోకి దూసుకుపోయిందని తెలిపారు. కార్యక్రమంలో తెలుగు మహిళ దుద్యాల అనిత దీప్తి, మండల తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు కాపిర్ల చంద్రశేఖర్‌నాయుడు, మాజీ శాప్ డైరెక్టర్, మామిళ్ళ రామయ్య, తెలుగు యువత కార్యదర్శి సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజల కోసం నిరంతరం పనిచేసే సిఎం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

రాష్ట్ర ప్రజల కోసం పనిచేసే ఏకైక నాయకుడు సీఎం జగన్మోహన్‌రెడ్డి అని జేసీ కన్వీనర్, కౌన్సిలర్ పార్నపల్లి కిషోర్ పేర్కొన్నారు. అహోబిలాపురం కాలనీలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రతి ఇంటికి వెళ్లి జగనన్న సంక్షేమ పథకాలు నెరవేర్చిన హామీల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, సచివాలయం కన్వీనర్లు ఈశ్వరయ్య, గండి ఆంజనేయులు, గృహ సారథులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో జడ్‌పిటిసి పాత్ర కీలకం

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె మండలాభివృద్ధికి జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి ఎనలేని కృషి చేశారని వైసిపి మండల బిసి సెల్ ప్రధాన కార్యదర్శి నల్లమేకల కృష్ణయ్య తెలిపారు. జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను ఆదివారం వైసిపి నేతలు ఘనంగా నిర్వహించారు. చింతల మడుగుపల్లె బైపాస్ రోడ్డులో నల్లమేకల కృష్ణయ్య ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. పార్టీ కార్యకర్తలకు స్వీట్స్ పంపిణీ చేశారు. రాజీవ్‌నగర్ కాలనీలో ఉన్న మదర్ థెరిస్సా అనాథ వృద్ధాశ్రమంలో సాయి మణికంఠ ప్యాషన్ షోరూం యజమాని సాయి మణికంఠ, బాలస్వామిరెడ్డి, మాజీ సర్పంచ్ ఉత్తయ్య ఆధ్వర్యంలో రూ.4 వేలు విలువ చేసే నిత్యవసర సరుకులను ఆశ్రమ నిర్వాహకుడు వెంకట సుబ్బయ్యకు అందజేశారు. అమ్మగారిపల్లె గ్రామ వైసిపి నేత ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వృద్ధులకు రెండు పూటల అన్నదానం చేశారు. కేరళ రాష్ట్రంలోని శబరిమలైలో రవికుమార్‌రెడ్డి సమక్షంలో అయ్యవారిపల్లి సర్పంచ్ రామగంగిరెడ్డి, మాజీ సర్పంచ్ ప్రసాద్‌రెడ్డి, సోమేశ్వరరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, ముతుకూరు శ్రీనువాసులురెడ్డి, వేణుగోపాల్ రెడ్డి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కొండారెడ్డి, కల్లూరు సుబ్బారెడ్డి, పద్మా రాజ్‌కుమార్, భాస్కర్‌రెడ్డి, చలమారెడ్డి, మండల కో-ఆప్షన్ అసనయ్య, ఎంపిటిసి రహంతుల్లా ఖాన్, గుజిరి దర్బార్, జిల్లా వక్ఫ్ బోర్డు సభ్యుడు ఖదీర్ పాల్గొన్నారు.

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-నందలూరు

అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్పదని శ్రీ సౌమ్యనాథస్వామి అన్నదాన ట్రస్ట్ కోశాధికారి చక్రాల రామసుబ్బన్న పేర్కొన్నారు. నాగిరెడ్డిపల్లె గ్రామపంచాయతీ అరవపల్లి గ్రామానికి చెందిన అలిశెట్టి చిన్నమ్మ ఎనిమిదవ వర్ధంతిని పురస్కరించుకొని ఆమె జ్ఞాపకార్థం వారి కుమారుడు బాలాజీ శివశంకర్ భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తుల సహకారంతో శుక్ర, శని, ఆదివారాలలో భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిత్య అన్నదాన పథకం కోసం కార్యాచరణ రూపొందించామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి శ్రీరాములు, పెంచలయ్య, శేషయ్య, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

భక్తులకు భోజనాన్ని వడ్డిస్తున్న బాలాజీ శివశంకర్

క్రైం కార్నర్

ఆటో ఢీకొని అక్కా తమ్ముడికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీకొనడంతో అక్కా తమ్ముడు తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం నిమ్మనపల్లె మండలంలో జరిగింది. వెంగలవారికురవపల్లికు చెందిన టి.సుజాత, తన తమ్ముడు గోపికృష్ణతో కలసి ద్విచక్ర వాహనంలో సొంత పనులపై చింతపర్తికు వెళుతుండగా, మార్గమధ్యంలోని అగ్రహారం పంచాయతీ తరిగొండవారి పల్లె వద్ద ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొంది. ప్రమాదంలో సుజాత, గోపికృష్ణ ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు వారిని 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నిమ్మనపల్లె పోలీసులు తెలిపారు.